

మందడం శిబిరంలో నినాదాలు చేస్తున్న రాజధాని మహిళలు

అమరావతి అన్నదాతల మహాపోరాటం గురువారానికి 1500 రోజులకు చేరింది. ఈ సందర్భంగా రాజధాని గ్రామాలైన వెలగపూడి, మందడం గ్రామాల్లో నిర్వహించిన సభలు దిగ్విజయంగా జరిగాయి. అమరావతి నిర్మాణం సాకారమయ్యే వరకు పోరాటం సాగిస్తామని రైతులు, మహిళలు ప్రతినబూనారు. రాజధానివాసులను పట్టి పీడిస్తున్న జగన్ రాక్షస పాలనను అంతమొందిస్తామని సవాలు చేశారు. అమరావతిని నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న జగన్, వైసీపీ పార్టీకి అఖిలపక్ష నేతలు హెచ్చరికలు చేశారు. సరిగ్గా 81 రోజుల్లో ప్రభుత్వం గాలికిపోతుందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు అండగా ఉంటుందన్న కారణంగా వామపక్ష నేతలు బీజేపీపై విరుచుకుపడ్డారు. ప్రజలందరి ఉమ్మడి శత్రువుగా పరిణమించిన జగన్‌ను గద్దె దింపేంత వరకూ తమ పోరాటం ఆగేది లేదని ఆయా పార్టీల నేతలు అమరావతి సమర శంఖం పూరించారు.

- జగన్‌పై విరుచుకుపడిన అఖిలపక్ష నేతలు
- వెలగపూడి, మందడం వేదికగా నేతల హెచ్చరికలు
- మూడు నెలల్లో సైతాను పాలన అంతం
- ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతి
- 'అమరావతి సమర శంఖారావం' సభలో నేతల భరోసా

అమరావతి.. సమర భేరి



మందడం సభలో శాసనమండలి చైర్మన్ షరీఫ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, రాజధాని రైతులు, పలువురు మహిళలు, పక్కన పూలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం



మందడం సభలో ప్రసంగిస్తున్న దేవినేని ఉమ, వేదికపై టీడీపీ నేతలు, వివిధ పార్టీల నాయకులు, రాజధాని రైతులు



న్యాయదేవత విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న టీడీపీ నేతలు



తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద అమరావతి ఉద్యమం 1500వ రోజు అంకెతో దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్లూరు/గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఉద్యమం 1500 రోజులకు చేరుకున్న సందర్భంగా ఆయా గ్రామాల్లో గురువారం సభలు నిర్వహించారు. అమరావతి జేఏసీ నేత పువ్వాడ సుధాకర్ అధ్యక్షతన వెలగపూడి శిబిరం వద్ద మొదలైన సభలో వేలాదిమంది రైతులు, మహిళలు, దళిత, బహుజనులు పాల్గొన్నారు. తొలుత అమరావతి అమరవీరులు 277 మందికి సభలో నివాళులు అర్పించారు. ఇటీవల మృతి చెందిన దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్‌లూథర్ చిత్రపటానికి తొలుత నివాళులు అర్పించారు. అనంతరం అమరావతి ఉద్యమ నినాదభేరి చేశారు. అనంతరం ప్రాసమణి ప్రసంగంతో సభ ప్రారంభమైంది. అమరావతి ఉద్యమాన్ని, రైతులు, మహిళల త్యాగపూరిత పోరాటాన్ని తన ప్రాసలతో ఆయన శ్లాఘించారు. ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టారు. రాజధాని ఉద్యమ గాయకుడు రమణ తన పాటలతో ఆకట్టుకున్నారు. రాజధాని గ్రామాల మహిళలు పలువురు కోలాట ప్రదర్శనతో అలరించారు.

అమరావతి ఉద్యమం సువర్ణ లిఖితం..

1500 రోజులుగా అమరావతి రైతులు సాగిస్తున్న ఉద్యమం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అమరావతిలోనే జగన్ పతనం మొదలైందన్నారు. ఫ్యాక్షనిస్టులకే వణుకు పుట్టించిన వీర నారీమణులు అమరావతి మహిళలన్నారు. ఒక్కసారి పోలీసులు లేకుండా అమరావతి రా.. జగన్ మా అమరావతి మహిళలు చాలు అంటూ హెచ్చరించారన్నారు. ఒక మోసగాడు, నయవంచకుడు రాష్ట్రాన్ని నాశనం చేస్తుంటే ప్రశ్నించలేని దద్దమ్మ ఎమ్మెల్యేలు బల్లలు చరిచారని, ఇప్పుడు వారికి తగిన శాస్తి జరిగి వారినే తరుముతున్నాడన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుంది.. నూరు శాతం అమరావతే రాజధాని అని తేల్చి చెప్పారు. సీపీఎం నేత బాబూరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి ఆక్సిజన్ ఇస్తోందే మోదీ ప్రభుత్వమన్నారు. అమరావతి విషయంలో జగన్, మోదీలిద్దరూ నిందితులేనన్నారు. ఇరువురినీ గద్దె దించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. పోలీసులు, లాఠీల దౌర్జన్యాలను ఢీకొని నిలబడిన అమరావతి రైతులకు మాజీ మంత్రి దేవినేని ఉమ అభినందనలు తెలిపారు. ప్రపంచ రాజధానిగా అమరావతిని చంద్రబాబు తీర్చిదిద్దుతారని హామీ ఇచ్చారు. అమరావతి రైతులే స్టార్ క్యాంపెయినర్లుగా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ అందరి ఉమ్మడి శత్రువుగా పరిణమించిన జగన్‌ను సాగనంపడానికి కలిసి కట్టుగా పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం మూడు రాజధానుల బిల్లును మండలిలో నిలువరించి జగన్ కుట్రను భగ్నం చేశామన్నారు. హిందూ మహాసభ సభ్యుడు వెలగపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ 81 రోజుల సమయమే మిగిలి ఉందని, బీజేపీ, సీపీఐ, సీపీఎంలు సిద్ధాంతాలను పక్కనపెట్టి రాష్ట్రం కోసం కలిసి చంద్రబాబును గెలిపించాలని వేడుకున్నారు.



అమరావతి రైతులకు మద్దతు తెలుపుతున్న అఖిలపక్ష నేతలు



వెలగపూడి శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

అమరావతిపై అసత్య ప్రచారాలు

వెలగపూడి శిబిరంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ సైకో జగన్ మీద మొట్టమొదట తిరుగుబాటు బావుటా ఎగరవేసింది అమరావతి రైతులేనన్నారు. అమరావతి భూములు నిర్మాణానికి పనికిరావని మద్రాసు ఐఐటీ ఇచ్చినట్లు ఫోర్జరీ లేఖలు చూపించి అమరావతి పై సైకో అసత్య ప్రచారాలు చేయించారన్నారు. వరద వస్తే ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తకుండా అమరావతిని ముంచాలని చూసిన దుర్మార్గుడన్నారు. నన్నపనేని రాజకుమారి సభలో కన్నీటి పర్యంతమయ్యారు. వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వం.. అమరావతి పునరుత్తేజం పొందుతుంది.. గెలుస్తుందన్నారు. మందడం సభలో శాసనమండల మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ మూడు రాజధానుల బిల్లును మండలిలో ఆమోదం పొందడానికి జగన్‌రెడ్డి అనేక ప్రలోభాలు చేశారన్నారు. అమరావతిని కాపాడటంలో టీడీపీ ఎమ్మెల్సీల పాత్ర ఎంతో గొప్పదన్నారు. కేవలం రాజకీయ కక్ష, చంద్రబాబు పేరు వినబడకూడదని, అమరావతిని రూపుమాపడానికి సీఎం జగన్‌రెడ్డి కుట్ర చేశారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా అదే జీవితమా అన్నంతగా ప్రభుత్వ వేధింపులు సాగాయన్నారు. వీటన్నింటికీ పరిష్కారం టీడీపీ- జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడమేనన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి పోరాటం తుది దశకు వచ్చిందన్నారు. మంచి రోజులు రాబోతున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గొర్రె కసాయిని నమ్మినట్లు మోదీ, అమిత్‌షాలను నమ్మవద్దన్నారు. దళిత జేఏసీ నేత పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ తనకు ఏ రాజకీయాలు లేవని తన జాతి రాజధాని కోసం 34 శాతం భూములిచ్చిందని అందుకే ఉద్యమం చేస్తున్నానన్నారు. పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ జగన్ అధికారంలో పోతే పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నేత కొలికిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర, దళిత, గిరిజన, బహుజన, మైనార్టీ, కాపు, చివరికి రెడ్లకు కూడా జగన్ ద్రోహం చేశారన్నారు. సభలో విజయవాడ పార్లమెంటు ఇన్‌చార్జి కేశినేని శివనాథ్(చిన్ని), కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనురాధ, మైనార్టీ నేత ఫరూక్ షుబ్లీ, బుచ్చిరామ్‌ప్రసాద్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ లీగల్ సెల్ గొట్టిపాటి రామకృష్ణ, హైకోర్టు న్యాయవాదులు చిగురుపాటి రవీంద్ర, లక్ష్మీనారాయణ, ఉమేశ్‌చంద్ర, రజని, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, ఉండవల్లి శ్రీదేవి భర్త శ్రీధర్, టీడీపీ నాయకులు నిమ్మల శేషయ్య, కనపర్తి శ్రీనివాసరావు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేళం భాగ్యారావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్, హైకోర్టు న్యాయవాదులు మహిళా జేఏసీ నేతలు రాయపాటి శైలజ, కంభంపాటి శిరీష, దళిత జేఏసీ నేతలు పులి చిన్నా, చిలకా బసవయ్య హైదరాబాద్ సీబీఎన్ ఫోరం అధ్యక్షుడు అమర్, అమరావతి రైతు జేఏసీ నేతలు ధనేకుల రామారావు, గొర్నేని స్వరాజ్యరావు, ఆలూరి శ్రీనివాసరావు, జమ్ముల శ్యాంకిషోర్, బెల్లంకొండ నరసింహారావు, కట్టా రాజేంద్ర, బెజవాడ రమేష్, కారుమంచి నరేంద్ర, గద్దె భాను, సత్తెనపల్లి జేఏసీ మహిళానేత ఎం. శారద పాల్గొన్నారు.




మందడం శిబిరంలో మద్దతు తెలుపుతున్న సీపీఐ, బీజేపీ, టీడీపీ నాయకులు



అమరావతి ఉద్యమంపై పాటల సీడీని విడుదల చేస్తున్న చిగురుపాటి తదితరులు

నేతల తిరుగుబాటు.. వైసీపీలో ఉలికిపాటు

- టీడీపీలో చేరేందుకు సిద్ధమైన నేతల సస్పెన్షన్
- తొలుత అధిష్ఠానం చర్చలు.. ససేమిరా అనడంతో వేటు



అద్దంకి, జనవరి 25: అద్దంకి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు పలువురు తిరుగుబావుటా ఎగరవేయడంతో వైసీపీ అధిష్ఠానం ఉలికిపాటుకు గురైంది. సంతమాగులూరు మండలానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చిన వెంకటరెడ్డి తన వర్గం నేతలతో కలిసి టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ అద్దంకి ఇన్‌చార్జ్‌గా పాణెం హనిమిరెడ్డి బాధ్యతలు తీసుకునే సమయంలో తమ వర్గానికి సరైన గుర్తింపు ఇవ్వలేదని నెల క్రితం చినవెంకటరెడ్డి తన వర్గీయులతో నరసరావుపేటలో సమావేశమైన విషయం తెలిసిందే. సంతమాగు లూరు మండల బాధ్యతలు తమ వర్గానికి అప్పగించాలని, లేదంటే భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకుంటామని అప్పట్లో అల్టిమేటం ఇచ్చారు. అయితే దీనిని అంతగా పట్టించుకోని వైసీపీ నాయకత్వం మొక్కుబడిగా చర్చలు జరిపినట్లు సమాచారం. దీంతో కినుక వహించిన ఆయన తన వర్గీయులతో నాలుగు రోజుల క్రితం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను కలిశారు. ఎంపీపీ యలమంద, పది మంది ఎంపీటీసీలు, 12 మంది సర్పంచ్‌లతో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు చినవెంకటరెడ్డి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అధిష్ఠానం చినవెంకటరెడ్డితో పాటు మిగిలిన నేతలపై ఒత్తిడి చేసి వైసీపీని వీడకుండా ఉండేలా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. అయితే, తాము నిర్ణయించుకున్న విధంగానే టీడీపీలో చేరేందుకు వారు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో పార్టీని వీడుతున్న వారిని వైసీపీ అధిష్ఠానం సస్పెండ్ చేసింది. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ అట్లా చినవెంకటరెడ్డి, సంతమాగులూరు ఎంపీపీ యర్రబర్ల యలమంద, పాతమాగులూరు మాజీ సర్పంచ్ జిర్రా విజయబాబు, పుట్టావారిపాలెం సర్పంచ్ సన్నిబోయిన గురుబ్రహ్మం, సంతమాగులూరు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అట్లా పెదవెంకటరెడ్డిని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు గురువారం వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సోదరులు.. సై

- చీరాల నుంచి పోటీ చేస్తామన్న ఆమంచి బ్రదర్స్
- అన్న బహిరంగంగా.. తమ్ముడు అంతరంగికంగా ప్రకటనలు
- జనసేన పాదయాత్రలో స్వాములు.. అనుచరులతో కృష్ణమోహన్

వేటపాలెం(చీరాల), జనవరి 25: చెరో పార్టీలో ఉన్న ఆమంచి సోదరులు స్వాములు(శ్రీనివాసరావు), కృష్ణమోహన్ చీరాల నుంచి పోటీ చేస్తామని ఎవరికివారే ప్రకటించుకుంటున్నారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి, చీరాల బాధ్యుడు ఆమంచి స్వాములు వేటపాలెం మండలం పందిళ్లపల్లి నుంచి దేశాయిపేట వరకు గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల స్వాములు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చీరాల నుంచి జనసేన తరఫున తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అంతకు రెండురోజుల ముందు పర్చూరు వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అనుచరులతో నిర్వహించిన అంతరంగిక సమావేశంలో పార్టీ, ఇండిపెండెంట్ అనేది పక్కన పెడితే తాను వచ్చే ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఆ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కూడా వారికి సూచించినట్లు అనుచరగణం చెప్తోంది. సోదరుల పోటీ ప్రకటనలపై రాజకీయవర్గాలతో పాటు సామాన్య జనాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. పర్చూరులో కృష్ణమోహన్ వైసీపీ కాడి కిందపడేసినట్లేనని, అధిష్ఠానం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని ఆమంచి అనుకూల, వ్యతిరేక వర్గాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. ఇక స్వాములు తాజా ప్రకటనపై ఆ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మిత్రపక్షమైన టీడీపీ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య స్వాముల పాదయాత్రకు గైర్హాజరయ్యారు. కొండయ్య అందుబాటులో లేనందున రాలేదని స్వాములు చెప్పారు. అయితే, కొండయ్య స్థానికంగానే రోజంతా చీరాల పరిధిలోనే ఉన్నారు. ఇరుపార్టీల అధిష్ఠానాల నుంచి ఏ నిర్ణయం వెలువడక ముందే తానే అభ్యర్థినని స్వాములు చేపట్టిన పాదయాత్రలో పాల్గొంటే తాను కూడా ఆయనతో ఏకీభవించినట్లవుతుందనే ఉద్దేశంతో కార్యక్రమంలో కొండయ్య పాల్గొనలేదని సమాచారం. స్వాములు ప్రకటన ఆయన వ్యక్తిగతమని జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రియాజ్ తెలిపారు. అయితే, నెలన్నర క్రితమే నాదెండ్ల మనోహర్ చీరాల సీటు తనకేనని చెప్పారని స్వాములు సన్నిహితులకు చెప్తున్నారు. మొత్తం మీద ఎప్పటి మాదిరిగానే చీరాల రాజకీయం రసకందాయగా మారింది.

బుల్లెట్ కన్నా శక్తివంతమైనది ఓటు

- ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ రంజిత్‌బాషా



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బుల్లెట్ కన్నా శక్తివంతమైనదని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ పివి.నాథ్ ఆడిటోరియంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి సభలో ప్రసంగించారు. ఓటుహక్కుతో భవిష్యత్ నిర్ణయించుకునే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 17 ఏళ్లు దాటిన వారందరూ ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18 ఏళ్లు దాటిన 15 వేల మంది పౌరులకు నూతనంగా ఓటు హక్కు కల్పించామన్నారు. 86 శాతం ఓటు హక్కు వినియోగించుకోవడంతో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నాయన్నారు. జిల్లాలోని 1510 పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. ఏఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ ఓటు ఆవశ్యకత, గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఓటు వేయనివారికి ప్రశ్నించే హక్కు ఉండదన్నారు. దశబ్దాలుగా ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులను సన్మానించారు. ఎన్నికల అధికారులు, అధ్యాపకులు, సచివాలయ ఉద్యోగులను సత్కరించి ధ్రువీకరణపత్రాలను అందజేశారు. నూతనంగా ఓటుహక్కు పొందిన వారికి గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, ఆర్డీవోలు గంధం రవీందర్, పి.సరోజిని, హేలాషారోను, వ్యవసాయకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహసీల్దార్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఓట్లపై.. డౌటు!



- ఫాం7ల ద్వారా తొలగించిన ఓట్లు 46,191
- జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫాం7లు 62,052
- తిరస్కరించినవి 15,861
- ఒక్క పర్చూరులోనే దాదాపు 12,000కు పైగా ఓట్ల తొలగింపు
- ఓటర్ల జాబితాను జల్లెడ పడుతున్న టీడీపీ

బాపట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఓటర్ల తుదిజాబితా ప్రచురణను సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాజకీయ పార్టీలన్నీ ఓటర్ల జాబితా వడపోతపై దృష్టి పెట్టాయి. అర్హత ఉండి తీసేసిన ఓట్లకు సంబంధించి ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఫాం7లకు సంబంధించి పెద్దఎత్తున వివాదం నడిచిన సంగతి తెలిసిందే. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైన గతేడాది జనవరి నుంచి డిసెంబరు 9 వరకు జిల్లావ్యాప్తంగా వచ్చిన ఫాం7 దరఖాస్తులు 62,052కాగా వాటిలో ఆమోదించినవి 46,191గా ఉన్నాయి. 15,861 దరఖాస్తులను వివిధ కారణాలతో యంత్రాంగం తిరస్కరించింది. ఇక ఫాం6లకు వచ్చేసరికి మొత్తం 72,250 రాగా ఇందులో 9,628 దరఖాస్తులు ఆమోదం పొందలేదు. అదేవిధంగా ఫాం8లు 49,990 వస్తే ఇందులో 3,058 తిరస్కరించారు. మొత్తంగా తొలి నుంచి వివాదం నడచిన పర్చూరులో ఫాం7ల ద్వారా గణనీయంగా ఓట్లు తొలగించినట్లు తేటతెల్లమవుతోంది. కానీ వీటిలో 75శాతం వరకు మరణించిన వారినే తొలగించినవని, మిగిలినవి మాత్రమే నివాస ప్రాతిపదికన తొలగించినవని అధికారులు చెబుతున్నారు.

పర్చూరులోనే గణనీయంగా...

ఫాం7లకు సంబంధించి తొలగించిన ఓట్లలో ఒక్క పర్చూరులోనే దాదాపు 12,000 ఉండడంతో పాలకపార్టీ చేసిన కుట్రల వల్లే పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించబడ్డాయని టీడీపీ ఆరోపిస్తోంది. ఫాం7ల ద్వారా తొలగించిన ఓట్లలో 35 శాతం ఇక్కడే ఉండడం, మిగిలిన 5 నియోజకవర్గాల్లో కలిపి 34,191 ఉండడం ఫాం7లద్వారా లబ్ధి పొందాలని చూసిన పాలకపార్టీ ప్రయత్నాలు ఫలించాయేమోనన్న అనుమానాన్ని టీడీపీ వ్యక్తం చేస్తోంది.

కేసులు నమోదు చేసినా...

పర్చూరు నియోజకవర్గ ఈఆర్‌వో ఫిర్యాదు మేరకు మొత్తం 22మంది ఫాం7 దొంగలపై కేసులు నమోదు చేయగా, మరో 25 మందిపై పోలీసులు వారి విచారణ ఆధారంగా కేసులు పెట్టారు. అయినప్పటికీ ఫాం7ల విషయంలో అధికార పార్టీ తన కుట్రలు ఆపలేదని తాజాగా విడుదల చేసిన తుది ప్రచురణను పరిశీలిస్తే అర్థమవుతోంది. ఫాం7 ద్వారా తొలగించిన అత్యధిక ఓట్లు ముసాయిదా జాబితా విడుదలైన గతేడాది అక్టోబరు 27 నుంచి డిసెంబరు 9 వరకు జరిగిన సవరణ ప్రక్రియలోనే ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం యంత్రాంగం తిరస్కరించిన వాటి స్థానంలో మళ్లీ ఫాం7 దొంగలు వాటిని దరఖాస్తు చేశారని, ఈ ఓట్లే ప్రస్తుతం తొలగించబడ్డాయని టీడీపీ ఆరోపిస్తోంది.

మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తుతాం...

ఆయా నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాను జల్లెడ పట్టే కార్యక్రమం ఇప్పటికే టీడీపీ చేపట్టింది. అర్హత కలిగి తీసేసిన ఓట్ల వివరాలతో మళ్లీ అభ్యంతరాలను లేవనెత్తుతామని, అవసరమైతే ఆధారాల సహా ఎన్నికల కమిషన్‌ను కలుస్తామని కూడా టీడీపీ నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా పర్చూరు నియోజకవర్గంలో ప్రతి బూత్‌లో పరిశీలిస్తామని, అవకతవకలు వెల్లడైతే యంత్రాంగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తామని చెబుతున్నారు.

ఇంకా పెండింగ్‌లో దరఖాస్తులు..

గతేడాది డిసెంబరు9 వరకు మాత్రమే వచ్చిన దరఖాస్తులతో ప్రస్తుతం తుది ప్రచురణ విడుదలైంది. ఆ తర్వాత వచ్చిన దాదాపు 2,000 ఫాంలకు సంబంధించి ప్రస్తుతం కసరత్తు మొదలైంది. ఈసీకి సంబంధించిన వెబ్‌సైట్ తుది ప్రచురణ విడుదలయ్యే వరకు ఫ్రీజ్‌లో ఉంది. అది బుధవారమే తిరిగి పనిచేయడం ప్రారంభమవడంతో యంత్రాంగం పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించింది. వీటితో అనుబంధ ప్రచురణ విడుదల చేస్తామని యంత్రాంగం చెబుతోంది. మరోవైపు కొత్త ఓట్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియ అంతా గతంలో మాదిరిగానే జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు తుది ప్రచురణకు అనుబంధంగా సప్లిమెంట్‌ను ప్రచురిస్తామని అప్పటివరకు కొత్త ఓటు నమోదుతో పాటు ఫిర్యాదులను స్వీకరిస్తామని యంత్రాంగం చెబుతోంది.



ఇళయరాజా కుమార్తె భవతారిణి మృతి



ప్రముఖ సంగీత దర్శకుడు, 'ఇసైజ్ఞాని' ఇళయరాజా కుమార్తె, సంగీత దర్శకురాలు, నేపథ్యగాయని భవతారిణి (47) కేన్సర్ కారణంగా గురువారం సాయంత్రం 5.20 గంటల సమయంలో శ్రీలంకలో మృతి చెందారు. ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ఆయుర్వేద చికిత్స కోసం సోదరుడు, సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా శ్రీలంకకు తీసుకెళ్ళారు. అక్కడి వైద్యులు కేన్సర్ నాలుగో దశగా గుర్తించి చికిత్స అందిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆమె గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. తన తండ్రి ఇళయరాజా సంగీతం అందించిన 'భారతి' అనే చిత్రం కోసం ఆమె పాడిన పాటకు ఉత్తమ నేపథ్యగాయనిగా 2000 సంవత్సరంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో సినిమా పాటలను ఆలపించారు. అంతేకాకుండా, ఆమె సంగీత దర్శకురాలిగా కూడా కొనసాగుతున్నారు. చెన్నై నగరంలోని రోసరీ మెట్రిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన ఆమె... నటి రేవతి దర్శకత్వం వహించిన 'మిత్ర మై ఫ్రెండ్' అనే చిత్రం ద్వారా సంగీత దర్శకురాలిగా, 'రాసయ్య' అనే చిత్రం ద్వారా గాయనిగా వెండితెరకు పరిచయమయ్యారు. తన తండ్రి ఇళయరాజా, సోదరులు కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చిన చిత్రాల్లోనే నేపథ్యగానం చేశారు. ఆమె దాదాపు 20కి పైగా చిత్రాలకు పాటలు పాడారు. అలాగే, 2002లో సంగీత దర్శకురాలిగా పరిచయమైన ఆమె.. దాదాపు పది చిత్రాలకు సంగీతం అందించారు. వీటిలో రెండు హిందీ చిత్రాలు కూడా ఉన్నాయి. 2019లో ఆమె చివరగా 'మాయాండి' అనే చిత్రానికి సంగీతం అందించగా, ఇపుడు మూడు చిత్రాలకు సంగీతం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, ఇళయరాజా కూడా శ్రీలంకలోనే ఉన్నారు. శనివారం శ్రీలంకలో ఇళయరాజా మ్యూజిక్ ఫెస్ట్ కార్యక్రమం జరగాల్సి ఉండగా, ఇందుకోసం ఆయన అక్కడకు వెళ్ళారు. భవతారిణి మృతదేహాన్ని శుక్రవారం నగరానికి తీసుకునిరానున్నారు. భవతారిణి భర్త శబరి రాజ్ వ్యాపారవేత్త.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కాన్ఫిడెంట్‌గా ఉన్నా

రవి కస్తూరి



'ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. యాక్షన్, ఎమోషన్ అంశాలతో పాటు ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. జీవితం చాలించాలనుకొనే ఓ వ్యక్తి దాన్ని ఎలా అధిగమించాడనే అంశాన్ని చిత్రంలో చూపించాం. సినిమా ప్రారంభం నుంచి దీనిపై కాన్ఫిడెంట్‌గా ఉన్నా' అన్నారు నిర్మాత రవి కస్తూరి. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రాన్ని ఆయన దయానంద్ దర్శకత్వంలో నిర్మించారు. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా గురువారం రవి మీడియాతో మాట్లాడారు. 'ఆస్ట్రేలియాలో వ్యాపారాలు చేస్తూ ఈ చిత్ర నిర్మాణం చూసుకోవడం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. కంటెంట్ మీద మాకు పూర్తి నమ్మకం ఉంది. ఫస్ట్ కాపీ చూసి హ్యాపీగా ఫీలయ్యా. ఇకపై నిర్మాతగా కొనసాగాలనుకుంటున్నా. ఇప్పటికే రెండు కథలు విన్నా. ఈ సినిమా రిలీజ్ అయ్యాక వాటిని అనౌన్స్ చేస్తాం' అని చెప్పారు.














హత్యా రాజకీయాలకు వైసీపీ కుట్ర

- ఎస్సీ ఎస్టీ బీసీ కాపు నేతల హత్యకు పన్నాగం
- ఆ నెపం టీడీపీ వారిపై నెట్టేందుకు యత్నం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని



జాబ్‌మేళా వివరాలు వెల్లడిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జనవరి25: ఎన్నికల వేళ రాష్ట్రంలో గురజాల నియోజక వర్గంతో పాటు మరికొన్ని నియోజక వర్గాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాపు నేతలను హత్య చేయించి, ఆ నెపాన్ని టీడీపీ నేతలపై నెట్టేందుకు అధికార వైసీపీ కుట్ర పన్నుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యేయరపతినేని శ్రీనివాస రావు ధ్వజ మెత్తారు. గురువారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని సామాజికవర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పుడు ఆ వర్గాలతో పాటు విశ్రాంత ఉద్యోగుల సొమ్మునూ దిగమింగుతున్నాడన్నారు. చంద్రబాబు, లోకేశ్, టీడీపీని తిట్టిన మంత్రులు, ఎమ్మెల్యేలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపులకే సీట్లు ఇవ్వని పరిస్థితి వైసీపీలో కొనసాగుతుందన్నారు. బాబాయి హత్య, కోడికత్తి శ్రీను డ్రామా వివరాలన్నీ బయటకు తెలుస్తాయనే కోర్టు విచారణకు జగన్‌రెడ్డి హాజరు కావటం లేదన్నారు. మొద్దు శ్రీను తరహాలో కోడికత్తి శ్రీనునూ హత్య చేయిస్తారేమోన్న అనుమానం ప్రజలు, శ్రీను కుటుంబ సభ్యులలో ఉందన్నారు. రానున్న ఎన్నికలలో అడ్డదారుల్లోనైనా గెలవాలని, కులాల మధ్య చిచ్చుపెట్టి హత్యాయత్నాలకు ఎత్తుగడ వేసే దురాలోచనతో వైసీపీ నేతలు వున్నారన్నారు. జంగమహేశ్వరపురం, అంబాపురంలో జరిగిన హత్యకేసును తనపై మోపేందుకు వైసీపీ నేతలు కుట్రపన్నినా నిజానిజాలేమిటో పోలీసు శాఖకు, ప్రజలకు తెలుసునని యరపతినేని అన్నారు.

నత్తనడకన ఆరోగ్యశ్రీ సేవలు..

రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లుగా ఆరోగ్యశ్రీ సేవలు నత్తనడకన నడుస్తున్నాయని, నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లింపు లేకపోవడంతో ఇప్పుడు వైద్యసేవలు నిలిపివేస్తున్నారన్నారు. గురజాల నియోజకవర్గంలో తాను 25 కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ అందించారని, ఒక్క పిడుగురాళ్లలో బాలిక కాలేయ చికిత్సకు రూ.15 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ అందించిన విషయాన్ని యరపతినేని గుర్తుచేస్తూ నాలుగేళ్లలో ప్రభుత్వం, ఎమ్మెల్యే కాను ఎవరికి సీఎం రిలీఫ్ ఫండ్ అందించారో చెప్పాలన్నారు.

27న వాగ్దేవి జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా..

రాబోయే ఎన్నికలలో 155 సీట్లు గెలిచి రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజాప్రభుత్వం ఏర్పడబోతుందని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురజాల సమీపంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు యరపతినేని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 50కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, ఇప్పటికే 1500 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. సమావేశంలో షేక్ బాబావలి, కొమ్మినేని రామచంద్రరావు, వీరాస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సాంబశివరావు, కోట హరి, రాష్ట్ర వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే నవీన్, చల్లగుండ్ల శ్రీను, ఎల్‌విఆర్, బొల్లా శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ శ్రీను, వల్లెపు రామకృష్ణ, నందిపాటి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు ఎమ్మెల్యే.. అవినీతి అనకొండ

- 'రా.. కదలిరా!' సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి దేవినేని
- చంద్రబాబు సభను జయప్రదంచేయండి : టీడీపీ, జనసేన నేతలు



రా..కదలిరా! సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని ఉమ

గుంటూరు,జనవరి 25(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే అవినీతి అనకొండ అంటూ మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు విరుచుకుపడ్డారు. ఈనెల 29న పొన్నూరులో జరగనున్న 'రా.. కదలిరా!' బహిరంగ సభకు సంబంధించి పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశం జరిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షత వహించిన సమావేశానికి దేవినేని ఉమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పొన్నూరు ఎమ్మెల్యే పెద్ద అవినీతిపరుడు. కొండలు, గుట్టలు, క్వారీలు అన్నీ కొల్లగొట్టేశాడు అంటూ విరుచుకుపడ్డారు. పొన్నూరులో టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కసిగా ఉన్నారన్నారు. ఈనెల 29న జరగబోయే చంద్రబాబు సభను విజయవంతం చేయాలన్నారు. తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరుగుతున్న కుట్రలు, అరాచకాలు, అక్రమాలు, దోపడీలు, దౌర్జన్యాలు, కుట్రల నుంచి ప్రజలను రక్షించుకోవడానికి రా..కదలిరా కార్యక్రమానికి చంద్రబాబు పిలుపునిచ్చారన్నారు. పొన్నూరులో జరిగే సభకు టీడీపీ, జనసేన నాయకులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ, జోన్-3 పరిశీలకుడు మంతెన సత్యనారాయణరాజు మాట్లాడుతూ జగన్‌రెడ్డి విధ్వంసకర పాలనలో జనం తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే వారికి సాంత్వన అని చెప్పారు. మాజీ ఎంపీ కొనకళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ సైకో జగన్ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడ డానికి ప్రజలందరూ సమాయత్తం కావాలని అన్నారు. గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు కొండపల్లి అప్పలనాయుడు మాట్లాడుతూ జగన్‌కి తెలిసింది రద్దులు, కూల్చివేతలు, దాడులు, కేసులేనన్నారు. గాదె వెంకటేశ్వర రావు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు సభకు జనసేన నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని చెప్పారు.

సమావేశంలో మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, దివి శివరాం, మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి, ఇన్‌చార్జులు మొహమ్మద్ నసీర్, కోవెలమూడి రవీంద్ర, బూర్ల రామాంజనేయులు, జనసేన పొలిటికల్ యాక్షన్ కమిటీ సభ్యుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, మంగళగిరి సమన్వయకర్త నందం అబద్దయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, పిల్లి మాణిక్యరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, మానుకొండ శివప్రసాద్, మద్దిరాల ఇమ్మానుయేల్, కనపర్తి శ్రీనివాసరావు, వడ్రాణం హరిబాబు, సుఖవాసి శ్రీనివాసరావు, దామినేని శ్రీనివాస రావు, సింహాద్రి కనకాచారి, భీమినేని వందనాదేవి, కంచర్ల శివరామయ్య, గోళ్ళ ప్రభాకర్, షేక్ మీరావలి, శాఖమూరి నారాయణ ప్రసాద్, కల్లూరి శ్రీనివాసరావు,ముత్తినేని రాజేష్, నాయుడు ఓంకార్, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, చుక్కపల్లి రమేష్, సౌపాటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

జగన్ నోట ఓటమి మాట

- అదే ప్రజా వ్యతిరేకతకు నిదర్శనం
- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 25: రాష్ట్ర వ్యాప్తంగాఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను గమనించే జగన్ నోట ఓటమి మాట మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ వైఫల్యాలపై నిప్పులు చెరిగారు. అతడి 56 నెలల పాలనలో ఏం చేశారని ప్రజలు తిరిగి ఓటు వేయాలో చెప్పాలని డిమాండ్ చేశారు. వైనాట్ 175 అన్న ఫీంకారాల నుంచి అభ్యర్థులను వెతుక్కోవాల్సిన దుస్థితికి చేర్చింది తన తప్పులేనని జగన్ గుర్తుంచుకోవాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చ లేని, తల్లిని, చెల్లిని ఇంటి నుంచి బయటకు పంపిన, సొంత బాబాయిని చంపిన నిందితులను సంకలో పెట్టుకొని తిరుగుతున్నా వ్యక్తిని ప్రజలు మళ్ళీ నమ్మే ప్రశక్తే లేదన్నారు. వైసీపీలో మిగిలిన నేతలు కూడా ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారి భవిష్యత్‌కు అంతమేలు ప్రత్తిపాటి సూచించారు.ఈపరిణామాల్లో జగన్ తన ఓటమికి ఎవ్వరినీ నిందించాల్సిన అవసరం లేదని, తను తవ్వుకున్న గుంటలో తానే పడుతున్నారని ఎద్దేవా చేశారు.



కొల్లిపరలో పాదయాత్ర చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

రాష్ట్రంలో ముస్లింలకు అన్ని విధాలా అన్యాయం

- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

కొల్లిపర, జనవరి 25: రాష్ట్రంలో ముస్లింలకు అన్ని రకాలుగా అన్యాయం చేసిన చేసిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆలపాటి తలపెట్టిన ప్రజాయాత్ర గురువారం 14వ రోజులకు చేరుకుంది. మండల కేంద్రం కొల్లిపరలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ కార్పొరేషన్, స్కిల్ డెవలప్‌మెంట్, కుట్టుమిషన్లు, సబ్సిడీ రుణాలు, ముస్లిం పథకాలను తీసివేసిన ఘనత జగన్ దక్కిందన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న నిధులను కూడా పక్కదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. రాజధాని లేని రాష్ట్రంగా చేసిన దుర్మార్గపు ప్రభుత్వమన్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమని ప్రజలందరి మద్దతుతో సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నేతలు ఆళ్ళ వీరారెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, ఆరే శేఖర్, ఆరిమండ వెంకటరెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, దాసరి నరసయ్య, కొల్లి కోటిరెడ్డి, బొంతు చంద్రిక, ఉప్పాల రమేష్‌రెడ్డి, తాతా అంజనేయులు, షేక్ రఫీ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీసీసీ చీఫ్ షర్మిల గుంటూరు పర్యటన

- ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశం
- భారీ ర్యాలీకి ఏర్పాట్లు

గుంటూరు, జనవరి 25: ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలతో గుంటూరులో సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిలకు ఆటోనగర్ నుంచి ఘన స్వాగతం పలికేందుకు ఆ పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. ఆటోనగర్ నుంచి ఎన్‌జీవో కాలనీలోని మెట్టు అంజిరెడ్డి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల, నరసరావుపేట జిల్లాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరానున్నారు. కాగా వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం పలకాలని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ ఉస్మాన్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డిలు పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

యువ ఓటర్లపై దేశ భవిష్యత్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి



పురంధేశ్వరిని సత్కరిస్తున్న కెఎల్‌యూ వీసీ సారథి వర్మ తదితరులు

తాడేపల్లి, జనవరి 25: దేశ భవిష్యత్తు యువ ఓటర్లపై ఆధార పడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. గురువారం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మనకు లభించిన ఓటు హక్కు ఎంతో శక్తివంతమైన ఆయుధమన్నారు. యువత దేశం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించి మంచి నాయకులను తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో నేడు భారత్‌కు ఉన్న ప్రతిష్ఠ ప్రధాని మోదీ వలననే సాధ్యమయిందన్నారు. నరేంద్రమోదీ కృషితో అయోధ్యలో బాలరాముడికి 500 వందల సంవత్సరాల తరువాత ప్రాణ ప్రతిష్ఠ జరిగిందని ఇది దేశం గర్వించ దగ్గ విషయమన్నారు. చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా నరేంద్రమోదీ, అమిత్ షా, నడ్డా దేశం కోసం పాటుపడుతున్నారన్నారు. ఇటువంటి నాయకత్వం ఎల్లవేళలా దేశానికి అవసరమన్నారు. అనంతరం యూనివర్సిటీలో జరుగుతున్న పరిశోధనలు అడిగి తెలుసుకుని ఇంక్యుబేటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీ మాట్లాడుతూ యువత స్టార్టప్ ఇండియాకు దిక్సూచి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ సారథి వర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, బీజేవైఎం నాయకులు మాధవ్, చైతన్యశర్మ, డాక్టర్ అభిరుచి మధు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు పీడీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

'ఆడుదాం ఆంధ్ర'లో అన్యాయం

- ఆడి.. గెలిచిన కీడాకారుల పేర్లు ఆన్‌లైన్లో ఎక్కని వైనం
- నియోజకవర్గస్థాయి పోటీల్లో రసాభాస

ప్రత్తిపాడు, జనవరి 25: ఆడుదాం ఆంధ్రలో ఆడి.. గెలిచిన వారికి తీవ్ర అన్యాయం జరిగింది. మండల స్థాయిలో విజేతలుగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు నిరాశతో తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో ఖోఖో పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రత్తిపాడు, పెద నందిపాడు మండలాలకు చెందిన ఖోఖో జట్టుకు తీవ్ర అన్యాయమే జరిగింది. మండల స్థాయిలో ఆడి, గెలిచిన వారు కాకుండా.. అసలు మండల స్థాయిలో ఆడనివారిని నియోజకవర్గ స్థాయిలో ఆడించారు. ప్రత్తిపాడు మండలానికి సంబంధించి ఖోఖో జట్టులో క్రీడా కారులు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండానే వారి చేత ఆటలు ఆటలు ఆడించారు. మీ పేర్లు మేము నమోదు చేస్తాం అని ఆ నాడు చెప్పిన అధికారులు వారి వద్ద నుంచి అన్ని అప్లికేషన్లు తీసుకుని ఆన్‌లైన్లో నమోదు చేయలేదు. అలాగే పెదనందిపాడు మండలానికి సంబంధించి ఆన్‌లైన్లో నమోదు చేసుకుని ఆటలు ఆడి, గెలిచిన టీం పేర్లు కూడా ఆన్‌లైన్లో లేకుండా పోయాయి. వేరే పేర్లు రావడంతో వచ్చిన టీంను వెనక్కు పంపించారు. దీంతో ఈ రెండు టీం సభ్యులు ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించారు. ఆన్‌లైన్లో పేర్లు వస్తేనే మేము ఇక్కడ ఆడించేది.. పేర్లు ఉన్న వారు మాత్రమే ఆడాలి అంటూ అధికారులు ఖరాఖండీగా తేల్చి చెప్పారు. ఇన్ని రోజులు మేము కష్టపడి ప్రాక్టీస్ చేసి ఇప్పుడు మమ్మల్ని వెనక్కు వెళ్లమనడం ఏమిటంటూ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి క్రీడా కారులను గ్రౌండ్ నుంచి బయటకు పంపించారు.

నిర్లక్ష్యం ఖరీదు రూ.60లక్షల కోట్లు

- ఇకనైనా సహజ వనరుల సాధనకై ఉద్యమించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

గుంటూరు(తూర్పు), జనవరి25: రాష్ట్ర ముగింట నుంచి సహజ వాయివు తరలిపోతుందని, న్యాయబద్ధమైన ధర కోసం రాష్ట్ర పాలకులు అడగడం లేదని, కేంద్రం కూడా పట్టించుకోవడం లేదని కేజీ బేసిన్ గ్యాస్ సాధన సమితి నాయకులు వాపోయారు. 1983లో కృష్ణా-గోదావరి బేసిక్ ఏర్పాటైనప్పటి నుంచి ఇంతవరకు రాష్ట్ర సంపద రూ.60లక్షలు కోట్లు తరలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీ బేసిన్ గ్యాస్, చమురు- ఆంధ్రప్రదేశ్ హక్కు అనే అంశంపై గుంటూరు అరండల్‌పేటలో ఆర్య సమాజ్ భవన్లో కేజీ బేసిన్ గ్యాస్ సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హజరైన నల్లమడ రైతు సంఘ నాయకులు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ మోదీ ప్రధాని అయిన తరువాత సహజవనరులు కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి, కనీసం రాష్ట్రాలకు రావాల్సిన వాటాలు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. కొద్దిగొప్పో ప్రభుత్వరంగ సంస్థపై ఓఎన్‌జీసీ రాయిల్టీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తుందని, రిలయిన్స్ మాత్రం ఒక్క రూపాయి ఇవ్వడం లేదని మండిపడ్డారు. వాటాలపై గతంలో సీఎంలుగా పనిచేసిన రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడు, కిరణ్ కుమార్‌లు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని, ప్రసుత్త ప్రభుత్వం మౌనం దాలుస్తుందని పేర్కొన్నారు. కేంద్ర. రాష్ట్ర పభుత్వ మాజీ సలహాదారు మహదేవ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని సంపద రాష్ట్రంలోని ఉందని, ముకేష్ అంబానీ సంపద 30శాతం సంపద కృష్ణా-గోదావరి బేసిన్ నుంచి సమకూరుతుందని వివరించారు. సమావేశంలో పీవీ మల్లిఖార్జునరావు, నాదెండ్ల బ్రహ్మయ్య, నళిని కాంత్, పాటిబండ్ల కోటేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్

1,14,103 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,14,103 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,19,090 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 59,352 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20100
నెంబరు. 5	10500	18500
273	12000	19000
341	8700	20000
4884	10500	15000
సూపర్ 10	15000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	8500	20000
దేవనూరు డీలక్స్	9000	19500
తెల్లకాయలు	5000	13000

వైసీపీని సాగనంపితేనే రాష్ట్రానికి విముక్తి

- 1500వ రోజుకు రైతుల ఆందోళనలు



1500ల రోజు దీక్ష సభకు హాజరైన మహిళలు

తుళ్లూరు, జనవరి25: వైసీపీని శాశ్వతంగా ఇంటిలో కూర్చోబెడితేనే రాష్ట్రానికి విముక్తి ఉంటుందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలుచేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1500వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనకబాటు తనానికి గురి చేశాడన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో దూసుకు పోతుంటే, ఏపీ మాత్రం తిరోగమనంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర సంపద అమరావతిని నిర్వీర్యం చేసిన సీఎం జగన్‌రెడ్డిని శాశ్వతంగా ఇంటికి పంపటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం రాజధాని గ్రామాల్లో కొనసాగింది. తుళ్లూరు ధర్నా శిబిరం వద్ద అమరావతి ఉద్యమం 1500వ రోజు అంకెను దీపాలు వెలిగించి ప్రదర్శించారు.

బైబిల్ మిషన్ మహాసభలకు నంబూరు స్టేషన్‌లో రైళ్ల నిలుపుదల

గుంటూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): బైబిల్‌మిషన్ మహాసభలు ఈనెల 26నుంచి ప్రారంభం కానుండటంతో యాత్రీకుల సౌకర్యార్థం పలు రైళ్లకు నంబూరు రైల్వేస్టేషన్‌లో నిలుపుదల సౌకర్యం కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ గురువారొ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 20 వరకు నెంబరు. 17282 నరసపూర్-గుంటూరు, నెంబరు. 17281 గుంటూరు - నరసపూర్, నెంబరు. 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్, నెంబరు. 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు నిలుపుదల సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

బాపట్ల వార్తలు



ఎన్నికల కేంద్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

బాపట్ల, జనవరి 25: స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు బాపట్ల వ్యవసాయ కళాశాలలోని భవన సముదాయాన్ని కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి స్ట్రాంగ్‌రూమ్‌లు ఉండాలని, ఈవీఎం యంత్రాలకు పటిష్ఠ భద్రత కల్పించాలని, స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రం సమీపంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 24హాల్స్ ఉండాలని అధికారులకు సూచించారు. ఎన్నికలకు ముందు, తదుపరి ఈవీఎం యంత్రాలు తరలింపు, స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చటంపై ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, డీఎస్పీ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి.శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ బాధ్యత మాస్టర్ ట్రైనర్లదే : కలెక్టర్

బాపట్ల, జనవరి 25 : ఎన్నికల నిర్వహణ బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తొలి శిక్షణా కార్యక్రమం గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల సిబ్బందికి సమర్థంగా శిక్షణ నివ్వాలన్నారు. సిబ్బందికి సందేహాలు నివృత్తి చేసేలా అత్యంత నైపుణ్యం, మెళకువలతో ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఆర్‌వోలు, ఎంసీసీ, సెక్టార్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు, పీవోలు, ఐటి బృందాలకు శిక్షణ ఇవ్వటానికి ఎన్నికల కమిషన్ రూపొందించిన పుస్తకాలను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, డ్వామా పీడీ డాక్టర్ బి. అర్జునరావు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలి

● ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జనవరి 25: రాబోవు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించటానికి ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసులకు మూడో విడత శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎన్నికల విధివిధానాలు, నియమ నిబంధనలు, సంబంధిత చట్టాలు తదితర అంశాలపై పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎలక్షన్ సంబంధిత చట్టాలు, నేరాలు, అక్రమ ఆయుధాలు, మద్యం, నగదు, ఇతర వస్తువులు సీజ్ చేసే ప్రక్రియ గురించి వివరించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల సమాచారం అక్కడ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికబద్ధంగా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ముగిసే వరకు పోలీసు ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికల కమిషన్ నియమనిబంధనల మేరకు తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎలక్షన్‌సెల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్పందన సెల్ ఇన్ స్పెక్టర్ మాలకొండయ్య, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీధర్

బాపట్ల, జనవరి 25: భారత గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై అన్నిశాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన తన ఛాంబర్ లో సమీక్షించారు. బాపట్ల జిల్లా అభివృద్ధిని చాటిచెప్పేలా వేడుకలు నిర్వ హించాలన్నారు. తాగునీటి సమస్య, పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. సంప్రదాయాలు, దేశభక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలన్నారు. స్టాల్స్, శకటాల ప్రదర్శన అద్భుతంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, జిల్లా అధికారులు డాక్టర్ ఎస్ విజయమ్మ, శ్రీలక్ష్మి, రాంబాబు, డాక్టర్ బి.అర్జునరావు, డాక్టర్ పి.సురేష్, ప్రసాద్, ఎ.భానుప్రతాప్, డాక్టర్ హనుమంతరావు, కృష్ణ, విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి పరిశోధన స్థానం సందర్శించిన ఫారెస్ట్ అధికారులు

బాపట్ల, జనవరి 25: బాపట్ల జీడిమామిడి పరిశోధనా స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ అండ్ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.మధుసూదనరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నెల్లూరు రీజనల్ మేనేజర్ సందీప్‌కృపాకర్ గురువారం బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానాన్ని సందర్శించారు. పరిశోధనా స్థానంలో అధిక దిగుడులను ఇచ్చే అంటుమొక్కల తయారీ విధానాన్ని పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. బాపట్ల ప్రాంతానికి అనువైన రకాలు గురించి వివరించారు. ఈ కార్య క్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జి.స్రవంతి, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బాపట్ల డివిజనల్ మేనేజర్ కె.అరుణ, ప్లాంటేషన్ మేనేజర్ చిన్నఅబ్బాయి, గాంధీ పాల్గొన్నారు.



అంటుమొక్కలను పరిశీలిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి వై.మధుసూధనరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నెల్లూరు రీజనల్ మేనేజర్ సందీప్‌కృపాకర్ తదితరులు

ప్రజలకు సంపూర్ణ వైద్యం అందించటం ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం, జనవరి 25 : ప్రజల ఆరోగ్యం కోసం సంపూర్ణ వైద్య సౌకర్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెంలో నూతనంగా రూ.7 కోట్ల 36లక్షలతో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన వైద్యశాలలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన భవనాన్ని పరిశీలించి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, ఎంపీడీవో భవనం మారుతిశేషమాంబ, ఈవోపీఆర్డీ కె.పద్మజ, పిట్టలవానిపాలెం సర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు, ఉప ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, రాష్ట్ర రహదార్ల డైరెక్టర్ షేక్.అహ్మద్ హుస్సేన్, ఉప సర్పంచ్ దోమా గంగమ్మ తిరుమలరెడ్డి, పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి దాసరి శివకుమార్, జిల్లా కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీస్ డాక్టర్ శేషుకుమార్, డిస్ట్రిక్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, పిట్టలవానిపాలెం సామాజిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ లలిత, వైద్యసిబ్బంది, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో రూ21 లక్షలతో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి స్థానిక సర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు, వెల్‌నెస్ నిర్వాహకులు, తదితరులతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు.

చర్చి ప్రతిష్ఠకు రూ.30 వేలు అందజేత

కర్లపాలెం, జనవరి 25 : మండలంలోని పేరలి గ్రామపంచాయతీ బక్కావారిపాలెంలో చర్చి ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన యువపారిశ్రామికవేత్త ఆర్మీ విజయ్ గురువారం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తు లో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్థులు, పెద్దలు ఆర్మీ విజయ్‌ను అభినందించారు.

టీడీపీకి అందరూ అండగా ఉండాలి

● నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ



ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నరేంద్రవర్మ, పార్టీ కార్యకర్తలు

బాపట్ల, జనవరి 25 : మండలంలోని వెదుళ్ళపల్లి కొత్తపాలెం గ్రామంలో గురువారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ ఇంటింటికి తెలుగుదేశం, మీమాటే-నాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేంద్రవర్మకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికెళ్ళి ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి మహిళలకు చీర, కరపత్రాలు, చేతిసంచి ఇచ్చి ఆశీర్వదించమని కోరారు. మహాశక్తి పథ కం, యువగళం నిధి, అన్నదాత పథకం, బీసీల రక్షణ చట్టం వంటివి రావాలంటే అందరు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, కార్యదర్శి సాంబశివరావు, చెన్నుపాటి కిషోర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

● కర్లపాలెం, జనవరి 25: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు గురువారం ఇంటింటికి తిరిగి మామీట - నాబాట కార్యక్రమాన్ని నిర్వహించి తెలుగుదేశంపార్టీ విధివిధానాలు గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీర, సంచి, పార్టీ విధివిధానాలు గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్క వెంకటస్వామి, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ వీరయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడిపార్టీ కార్యాచరణలో భాగంగా గురువారం ఉమ్మడి పార్టీ నాయకులు కర్లపాలెంలోని 133వబూత్ లెవల్‌లో ఇంటింటికి తిరిగి పార్టీల విధివిధానాలను ప్రజలకు తెలియజేస్తూ బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్టల వేణుగోపాలరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులు చిలకల సురేంద్రబాబు, ప్రకాష్‌రావు, 132వ బూత్ ఇన్‌చార్జి వెంకటరామరాజు పాల్గొన్నారు.

రక్షణ సైన్యం.. నూతన దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం

కర్లపాలెం, జనవరి 25: మండలంలోని బక్కావారిపాలెంలో రక్షణ సైన్యం నూతన దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో గురువారం బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమావారిపాలెంలో ఫ్లెక్సీ వివాదం

● అన్నం సతీష్ ఫ్లెక్సీ తొలిగింపుపై కాలనీవాసుల ఆగ్రహం

● పెద్ద ఎత్తున ఆందోళన.. సర్దిచెప్పిన అధికారులు

బాపట్ల, జనవరి 25: పట్టణంలోని భీమావారిపాలెంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించే సమయంలో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ ఫ్లెక్సీని అధికారులు తొలగించారు. దీంతో అన్నం సతీష్ అభిమానులు, కాలనీవాసులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీ ఎందుకు తొలగించారంటూ అధికారులను, నాయకులను నిలదీశారు. దీంతో ఆప్రాంతంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, పట్టణ సీఐ యు.శ్రీనివాసులు ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో ఎమ్మెల్యే కోన రఘుపతి వారితో మాట్లాడి ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకోమని, ఉద్దేశపూర్వకంగా ఇది జరిగి ఉండదని నచ్చజెప్పారు. దీంతో ఆందోళనకారులు శాంతించి తిరిగి సతీష్ ప్రభాకర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. డీఎస్పీ టి.వెంకటేశులు పరిస్థితిని సమీక్షించారు.



భీమావారిపాలెం యూత్‌కు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రతి కుటుంబాన్ని లక్షాధికారిగా చేయటమే లక్ష్యం

● ఆల్ తెలుగు ప్రజాపార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శివభాగ్యారావు

బాపట్ల, జనవరి 25 : రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రిని చేయటంతోపాటు ప్రతి కుటుంబాన్ని లక్షాధికారిగా చేయటమే లక్ష్యంగా ఆల్ తెలుగు ప్రజా పార్టీని స్థాపించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, విశ్రాంత ఐఆర్ఎస్ అధి కారి డాక్టర్ కటికల శివభాగ్యారావు తెలిపారు. పార్టీశ్రేణులతో కలిసి బాపట్ల పట్టణంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తానన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో తమ పార్టీ తరుపున పోటీ కి సిద్ధమన్నారు. ఇప్పటికే 21మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ పరిశీలకులు డాక్టర్ కాగిత వరప్రసాదరావు, విజయవాడ తూర్పు ఇన్‌చార్జి చింతల కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ నమ్మి అప్పారావు యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కటికల రవికుమార్, గుంటూరు అధ్యక్షులు బాలు, విజయవాడ ఉపాధ్యక్షులు టి.ప్రతాప్, కాగిత సుందరదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ తట్టుకోలేక రాహుల్ యాత్ర అడ్డుకుంటున్న బీజేపీ

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, జనవరి 25: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర, భారతన్యాయ యాత్రకు వస్తున్న ప్రజాదరణ చూచి తట్టుకోలేక బీజేపీ అడ్డుకుంటున్నదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆరోపించారు. పార్టీశ్రేణులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ఎన్నికల ముందు అరెస్టు చేస్తే కాంగ్రెస్ గెలుస్తుందని భావించి ఎన్నికల తర్వాత అరెస్టు చేస్తామని బీజేపీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో వైఎస్ షర్మిల పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందన్నారు. దీనిని తట్టుకోలేక వైసీపీ శ్రేణులు విమర్శలు చేయటం హాస్యాస్పదమన్నారు. సినీదర్శకుడు రాంగోపాల్‌వర్మ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌మీద, షర్మిలమీద అవాకులు, చెవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, సీనియర్ నాయకులు చింతాబాబురావు, శీలం సాగర్, దోనేపూడి రవి, షేక్ మజురున్నీసా, కోన జయశాంతి, శంకర్‌రెడ్డి, బక్కా రోశయ్య, సురేష్, నక్కల రాంబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు షర్మిల సభకు తరలిరావాలి

వేమూరు, జనవరి 25: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గుంటూరు జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని వేమూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తాడికొండ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం చావలిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల గుంటూరు జిల్లా పర్యటన శుక్రవారం ఏర్పాటు చేశారన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నా రు. సమావేశంలో మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోజు రాత్రి' చిత్రం ప్రారంభం

బాపట్ల జనవరి 25 : వీఆర్ క్రియేషన్స్ సమర్పణలో నిర్మిస్తున్న ఆరోజు రాత్రి చిత్ర నిర్మాణ పూజా కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. డీఎస్పీ టి.వెంకటేశులు ముఖ్యఅతిథిగా పాల్గొని చంద్రశేఖర్ దర్శకత్వంలో సినిమా రూపొందించటం సంతోషదాయకమన్నారు. ప్రత్యేకఅతిథులుగా విచ్చేసిన నటులు షేక్ ఆదంషఫీవుల్లా, షేక్ సయీద్‌పీర్‌లు మాట్లాడుతూ చిత్ర నిర్మాణం బాపట్ల పరిసర ప్రాంతాల్లో జరుగుతుందన్నారు. చిత్రానికి వెంకు రచన చేస్తున్నారని యామాని, రుచిత, షఫీ, హర్ష, శరత్, ఫాతిమాలను పరిచయం చేశారు. తొలిక్లాప్ డీఎస్పీ కొట్టగా డాక్టర్ మెండు అవంతి కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, వెంకటేష్, సురేష్, భ్రమర, బ్రహ్మేశ్వరి పాల్గొన్నారు.

అడవిపల్లెపాలెంలో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు

బాపట్ల, జనవరి 25 : మండలంలోని అడవిపల్లెపాలెంలో ఎస్‌టూనీడి ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా గురువారం అక్కడ డిజిటల్ క్లాస్‌రూమ్ ఏర్పాటు చేసి ఫౌండేషన్ డైరెక్టర్ తోట సురేష్ బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి తోట రమ్యపావని, గోగు శివ, దివ్య, మల్లాది రత్నం, ద్రాక్షావలి, మరియమ్మ, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రంజిత్‌బాషా నుంచి ఉత్తమ ఈఆర్వోగా అవార్డు అందుకుంటున్న ఆర్డీవో హేలా షారోన్

ఉత్తమ ఈఆర్వోగా హేలా షారోన్

రేపల్లె, జనవరి 25: విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించినందుకుగాను ఉత్తమ ఈఆర్‌వోగా రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ ఎంపికయ్యారు. గురువారం బాప ట్లలో కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదగా ప్రశంసాపత్రా న్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆమెను అభినందించారు.

ఉత్తమ అసిస్టెంట్ ఈఆర్వోగా మెహర్‌కుమార్

అమృతలూరు, జనవరి 25 : 14 నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఉత్తమ అధికారి అవార్డును తహసీల్దార్ మెహర్‌కుమార్ గురువారం అందుకున్నారు. నియోజకవర్గ పరిధిలో మండల అసిస్టెంట్ ఎలక్టరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మెహర్‌కుమార్‌కు కలెక్టర్ రంజిత్‌బాషా ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా అవార్డును బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో అందుకున్నారు.

ఉత్తమ బూత్ లెవల్ ఆఫీసర్‌గా పవన్‌కుమార్

బాపట్ల, జనవరి 25 : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామపంచాయతీ కార్యదర్శి తాతా సాయిపవన్‌కుమార్‌కు ఉత్తమబూత్ లెవల్ ఆఫీసర్ అవార్డు లభించింది. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదగా పవన్‌కుమార్‌కు అవార్డు అందజేసి అభినందించారు. బీఎల్‌వో విధులు సమర్థవంతంగా నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర స్థాయిలో ప్రతిభా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ ఆచంట అమరేష్‌తోపాటు పలువురు పవన్‌కుమార్‌ను అభినందించారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డు అందుకుంటున్న సాయిపవన్‌కుమార్

అద్దేపల్లి రామకోటి ఉత్సవాలు ప్రారంభం

భట్టిప్రోలు, జనవరి 25: అద్దేపల్లి రామకోటి ఉత్సవాలుగా పేరుగాంచిన 73వ శ్రీరామనామస్మరణ కోటి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి ప్రభాతసేవ, కోదండరామస్వామికి సహస్రనామార్చన పూజ, శ్రీరామ సప్తాక్షరీ పటంతో గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులతో లిఖించిన సప్తాక్షరీ గ్రంథాలకు పూజ చేసిన అనంతరం గ్రంథాలకు ఏకకాలంలో 108 మందిరంలలో సామూహిక పూజలు జరిపించారు. శుక్రవారం అద్దేపల్లిలోని ప్రాంగణంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు శ్రీరామనామ స్మరణ ఆధ్యాత్మిక సంఘం అధ్యక్షులు కె.భాస్కరరావు తెలియజేశారు.

ప్రధాన మంత్రి జన ఔషధ కేంద్రం ప్రారంభం

భట్టిప్రోలు, జనవరి 25: కేంద్ర ప్రభుత్వం ఔషధ కేంద్రాల ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన మందులు పంపిణీ చేస్తున్నందున ప్రజలు సద్వినియోగించుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి కేవీ రామారావు అన్నారు. స్థానిక వ్యవసాయ పరపతి సహకార సొసైటీ ప్రాంగణంలో గురువారం జన ఔషధ కేంద్రాన్ని రామారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదవర్గాలకు జనరిక్ మందులను అందుబాటులో ఉంచేందుకే కేంద్రప్రభుత్వం ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, సభ్యుడు కుక్కల వీరరాఘవయ్య, కో ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రారు మరకా రవికుమార్, డీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎస్ అరుణ, సూపర్‌వైజర్ ప్ర సాద్, సీఈవో వేములపల్లి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు సీఐగా రామకృష్ణ

వేమూరు, జనవరి 25: వేమూరు పోలీస్‌స్టేషన్ సీఐగా పసుపులేటి రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేసిన వెంకటేశ్వరరావు పదోన్నతిపై వెళ్లగా కొన్ని రోజులపాటు చుండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వేమూరు సర్కిల్‌కు నూతన సీఐని నియమించారు. పోలీస్‌శాఖ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బియ్యం వ్యాపార దుకాణాల్లో తనిఖీ

బాపట్ల, జనవరి 25: పట్టణంలో బియ్యం వ్యాపారం చేస్తున్న దుకాణాలను జిల్లా తూనికల అధికారి లిల్లీ, ఇన్‌స్పెక్టర్ రామదాసు, జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్ డీటీ ఓంకార్ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు చేశారు. రూన్సీ రైస్‌ట్రేడర్స్‌ను తనిఖీ చేసి నాణ్యత లేని బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. రూ.10వేలు జరిమాన విధించి స్టాక్ రిజిష్టర్ ఏర్పాటు చేసి కొనుగోలుదారులకు శాంపిల్స్ చూపించాలన్నారు. నాణ్యతా ఉండేవిధంగా చూడాలని హెచ్చరించారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

నగరం, జనవరి 25: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నగరం ఎస్వీ ఆర్ఎం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం బాల్‌బ్యాడ్మింటన్‌లో పురుషుల కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధి ంచటంతో క్రీడాకారులను అభినందించారు. ఖాజీపాలెంలో నిర్వహించిన అంతర్ కళాశాల రన్నింగ్ ఈవెంట్‌లో ద్వితీయ బహుమతి సాధించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, మా గంటి సుధాకరరావు, పి.అమరేశ్వర్‌రెడ్డి, వి.సాంబమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవరి పండగ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి

అమృతలూరు, జనవరి 25: మండలపరిధిలోని కూచిపూడి, యల వర్రు గ్రామాల్లో జనవరి పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా పాస్టర్స్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘస్తుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబును దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, తుమ్మల భుజంగరావు, కా వూరి కమలాకర్, మేకా రాంబాబు, మట్లపూడి జయపాల్, కూచిపూ డి వెంకటేష్, దేవరపల్లి జయరావు, రావి రణధీవ్, యువకులు, సంఘపెద్దలు తదితరులు పాల్గొన్నారు. యడవూరులో బొంతా ఆంజ నేయులు, కుర్రా రాము, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆనందబాబును సత్కరిస్తున్న సంఘస్తులు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి : ఎలినేడి

రేపల్లె, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకవిధానాల ను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని టీడీపీ రేపల్లె నియోజకవర్గ పరిశీలకులు ఎలి నేడి రామస్వామి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్లు యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లస్టర్లు యూనిట్ ఇన్‌చార్జ్‌లకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని రేపల్లె నియోజకవర్గంలో అనగాని మూడోసారి విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు, మల్లాది రామకృష్ణ, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, మోర్ల అంజయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేపల్లె నియోజకవర్గ పరిశీలకులు ఎలినేడి రామస్వామి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

రేపల్లె, జనవరి 25: ఓటు అనే ఆయుధం ద్వారా సమ సమాజ నిర్మాణ స్థాపన జరుగుతుందని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. గురువారం స్థానిక చెరుకుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో 14వ జాతీయ ఓటర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 80ఏళ్ళు నిండిన ఓటర్లను పూలమాలలతో సన్మానించి ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం 80ఏళ్ళు పైబడిన సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఓటర్లు, యువత పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో హేలా షారోన్, అధికారులు, ఓటర్లు

● బాపట్ల, జనవరి 25: బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. బాపట్ల మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దంపతుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కొచ్చెర వినయ్‌రాజు అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు గడ్డం ఏలియా ముఖ్యఅతిథిగా పాల్గొని ఓటు గొప్పతనాన్ని, ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో చిరంజీవి, గుదే రాజారావు, మేరుగ ప్రేమయ్య, తమలపాకుల భాస్కరరావు పాల్గొన్నారు.



వేమూరులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ నాగరాజారావు

● వేమూరు, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని వేమూరులో గురువారం ర్యాలీ నిర్వహించారు. జి.నాగరాజు ఆధ్వ ర్యంలో అధికారులు రెవెన్యూ సిబ్బంది విద్యార్థులతో కలసి నిర్వహించారు. రాజ్యాంగం కల్పించినటువంటి ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వెంకటేశ్వరరావు, బీఎల్వోలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 25: మండలంలోని వెల్లటూరు జిల్లాపరిషత్ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఓటు హక్కు మనందరి బాధ్యత అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ఔన్నత్యం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, రాజ్యాంగ పీఠికలు విశేషాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.అరుణకుమారి, ఉపాధ్యాయుడు షేక్ సుభాని, గుర్రం మురళీ మోహన్, కె.శివరామకృష్ణలు పాల్గొన్నారు. స్థానిక టీఎంరావ్ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వ హించారు.

● చుండూరు, జనవరి 25: ప్రతి ఒక్కరూ ఓటువిలువ గుర్తెరగాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ వికాసానికి ప్రతి ఒక్కరూ తమ ఓటు వినియోగించుకోవాలని తహసీల్దార్ జి.కనకదుర్గ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం యడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఓటర్లకు అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా మండలంలో 80సంవత్సరాలు నిండిన పెద్దలను ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థులకు ఓటు హక్కుపై వ్యాసరచ, వక్తృత్వం, రంగవల్లి పోటీలు నిర్వహించారు. కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● నగరం, జనవరి 25: 18ఏళ్ళు నిండిన వారందరూ ఓటు హక్కు కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఓటు హక్కు అవగాహన ఉండా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శివయ్య, ఎస్‌కే మస్తాన్, గోపీకృష్ణ, కామేష్, అనిల్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పెసర్లంక హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

భట్టిప్రోలు, జనవరి 25: మండలంలోని పెసర్లంక జిల్లాపరిషత్ హైస్కూల్లోని విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. స్థానిక పాఠశాల ఆవరణలో ట్యాబ్‌లను ఎంపీపీ డి.లలితకుమారి, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ప్రజాప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.దేవరాజ్, గ్రామ సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నన్నెపాముల చంటి, హెచ్‌ఎం మహబూబ్ భాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, జనవరి 25: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వ హించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, అర్చకులు లక్ష తమల పాకులతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన శ్రీన్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు వ్యవహరించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

















రాష్ట్రంలో అరాచకం, విధ్వంసమే!

▸ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజం

పర్చూరు, జనవరి 25: వైసీపీ ప్రభుత్వంలో అక్కా చెల్లెమ్మలకు అసరా కరువైందని, టోకరాగానే మిగిలిందని, రాష్ట్రంలో అభివృద్ధి తప్ప అరాచకం, విధ్వంసమే కొనసాగుతుందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు అధికారం కోసం, నేడు అధికారంలోకి వచ్చాక కల్లబొల్లి మాటలతో మహిళలను నిట్టని లువునా మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షల మందికే ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలను చెల్లించిన 75శాతం మహిళలకు టోకరా వేయటం మోసం కాదా అని ఏలూరి సాంబశివరావు ప్రశ్నించారు.

నిత్యావసర వస్తువుల ధరలు, అప్పులు, పన్నుల చార్జీలతో ఒక్కో కుటుంబంపై రూ.8లక్షల భారం మోపా రన్నారు. మద్యపాన నిషేధమని చెప్పి అధికారం లోకి వచ్చాక నాసిరకం మద్యంతో మహిళల మంగళసూత్రాలను బలిగొం టున్నారని ఆరోపించారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డాగా రాష్ట్రాన్ని మార్చారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో మహిళలు సంఘటితంగా అహంకార, విధ్వంస ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.

వైసీపీకి నీలం శామ్యూల్ మోజెస్ రాజీనామా

చీరాల, జనవరి 25: వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నీలం శామ్యూల్ మోజెస్ పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధ్యక్షుడికి తన రాజీనామా లేఖను పంపినట్టు తెలిపారు. పలు అంశాలలో తగిన రీతిలో స్పందన లేకపోవటంతో పార్టీ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పారదర్శక పాలన టీడీపీ, జనసేనతోనే సాధ్యం



స్వాములను గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

వేటపాలెం(చీరాల), జనవరి 25: రాష్ట్రంలో అరాచకపాలన సాగుతుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, చీరాల నియోజకవర్గ బాధ్యుడు ఆమంచి స్వాములు(శ్రీనివాసరావు) అన్నారు. సహజ వనరులను కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనించాలంటే టీడీపీ, జనసేన పార్టీల కూటమి గెలుపు అనివార్యమని ఆయన పేర్కొన్నారు. గురువారం వేటపాలెం మండలం పందిళ్లపల్లి నుంచి దేశాయిపేట వరకు స్వాముల పాదయాత్ర చేపట్టారు. మార్గమధ్యమంలో ఎన్టీఆర్, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. వేటపాలెం సెంటర్లో నాయకులు, కార్యకర్తలు స్వాములను గజమాలతో స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున చీరాల నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రియాజ్, పర్చూరు, ఎస్ఎన్ పాడు నియోజకవర్గాల పార్టీ బాధ్యులు విజయ్‌కుమార్, కె.బాబు, కార్యదర్శి గూడూరి శివరామ ప్రసాద్, ఆమంచి రాజేంద్ర, టీడీపీ కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడి మృతి

బల్లికురవ, జనవరి 25: మండలంలోని పెదఅంబడిపూడిలో గురువారం బైకుపై పొలం వెళ్లివస్తున్న గుంటుపల్లి ఈశ్వరరావు(33) అనే యువకుడు ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్‌లో ఉన్న కాలువలో పడి మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. అంబడిపూడి గ్రామానికి చెందిన గుంటుపల్లి సింగయ్య రెండో కుమారుడు ఈశ్వరరావు పొలం పనులకై కొమ్మినేనివారిపాలెం వైపు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో ఒక్కసారిగా బైకు మార్జిన్‌లోని నీటి గుంటలోకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అవివాహితుడు అయిన యువకుడి మృతదేహాన్ని వెంటనే నీటిలో నుంచి బంధువులు బయటకు తీశారు. రోజు మాదిరిగానే పొలం పనులకు వెళ్లిన తమ కుమారుడు విగత జీవిగా ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. యువకుడి మృతితో అంబడిపూడి బీసీ కాలనీలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

చినగంజాం, జనవరి 25: భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయాలు పాలైన సంఘటన స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపల్లెపాలెంకు చెందిన దండుప్రోలు దుర్గాప్రసాద్, అతని భార్య రమాదేవి భవననిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. సోపిరాల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న గృహం వద్ద కొద్దిరోజులుగా పనిచేస్తున్నారు.

గురువారం ప్లాస్టింగ్ చేస్తున్న సమయంలో దుర్గాప్రసాద్ పరంజాపై నుంచి జారి కిందగల సోపిరాల టౌన్ ఫీడర్ 11 కేవీ విద్యుత్ తీగలపై పడ్డారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌కు కుడి కాలు, ఎడవ చేయికి తీ వ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతనిని తోటి కార్మికులు ప్రైవేటు వాహనంలో నరసరావు పేట ప్రైవేటు వైద్యశాల కు తరలించారు. దుర్గా ప్రసాద్ ప్రమాదానికి గు రైన సమయంలో అతని భార్య రమాదేవి కూడా అక్కడే పనిచేస్తుంది.

నేడు ఎమ్మెల్యే ఏలూరి జన్మదిన వేడుకలు

మార్టూరు, జనవరి 25: తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు 47వ జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. ఉదయం 10 గంటలకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మార్టూరులోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మార్టూరులో తూర్పు బజారున వినాయకుని విగ్రహం వద్దకు చేరి అక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడినుంచి పడమర బజారు గుండా ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ఏలూరికి జన్మదిన శుభా కాంక్షలను తెలియచేస్తూ కేక్ కట్ చేస్తారు. మధ్యాహ్నం భారీగా అన్నదానం ఏర్పాటుచేశారు. జన్మదిన కార్యక్రమాలకు ఏలూరి అందుబాటులో ఉండరని పార్టీ నాయకులు తెలిపారు. మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వలపర్ల గ్రామంలో కొమ్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ అధికారి అవార్డు

చీరాల, జనవరి 25: మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని చీరాల నియోజకవర్గంలో ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారిగా గుర్తించారు. గురు వారం బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా రామచంద్రారెడ్డి అవార్డు అందుకున్నారు. ఈసంద ర్భంగా పలువురు అభినందించారు.

ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలి

చినగంజాం, జనవరి 25: ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని తహ సీల్దార్ పాలపర్తి పార్వతి అన్నారు. నూతనంగా ఓటు కలిగిన యవతీయువకులు తమ ఓటును వినియోగించుకోవాలని చెప్పారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం వద్ద నుంచి మండల సముదాయ కార్యాల యాల ఎదురుగా గల ఆర్అండ్‌బీ రోడ్డు వరకు రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థిను లు, అధికారులు, ఉపాధ్యాయులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశా రు. తహసీ ల్దార్ కార్యాలయంలో ఓటు కలిగిన సీనియర్ సీటిజన్స్ మార్కాపురం వెంకటసుశీల, తెలిమల్లి సుశీలను తహసీల్దార్ సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ అధికారులు, గ్రామ రెవె న్యూ అధికారులు, వీఆర్ఏలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం

చీరాల, జనవరి 25: ఎన్నికలలో ప్రతి ఓటు కీలకం, అందుకు సం బంధించిన బాధ్యులు సమన్వయంతో అడుగులు వేస్తే సత్ఫలితాలు వ స్తాయని ఇంటిగ్రేటెడ్ శిక్షణకు హాజరైన బాధ్యులకు శిక్షకులు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఉదయం, సాయంత్రం రెండు విభాగాలుగా నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్లు, బూ త్ ఇన్‌చార్జులకు శిక్షణ ఇచ్చారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రధానంగా పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధి, విధా నాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ట్రైనర్స్ గ్లోరి ఎనెట్, బేతపూడి సురేష్, సుబ్బారాయుడు, దయాబాబు, నాగినేని రామకృష్ణ, నక్కల శ్రీనివాసరావు, అట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి పోలీసుల రూటే సప'రేటు'

- చోరీలలో సొత్తు రికవరీ అయితేనే కేసులు నమోదు
- చేతులు తడిపితేనే ఇసుక రవాణాకు రైట్.. రైట్
- బెల్ట్‌షాపులలో పట్టుబడ్డ మద్యం కేసులలోనూ కక్కుర్తి
- పెద్ద మొత్తంలో బాటిళ్ళు పట్టుబడినా.. కేసులో మాత్రం సింగిల్ డిజిట్ దాటదు!

అద్దంకి, జనవరి 25: అద్దంకి పోలీసుల తీరే వేరేగా ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల చోటుచేసుకుంటున్న పలు సంఘటనలు అద్దంకి పోలీసుల తీరును తేటతెల్లం చేస్తున్నాయి. అద్దంకి పట్టణంలో తరచూ మోటార్‌సైకిళ్ళ దొంగతనాలు, ఇతర చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయి. అయితే పోలీస్ స్టేషన్ లో నమోదు అవుతున్న కేసులు మాత్రం అత్యల్పం మాత్రమే. కేసులు నమోదు చేస్తే రికవరీ చేయాల్సి వస్తుందన్న భయంతో అసలు కేసులే నమోదు చేయటంలేదని పలువురు బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, పొరపాటున ఎక్కడైనా దొంగలు దొరికి, సొత్తు రికవరీ అయితే మాత్రం ఆగమేఘాల మీద కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల ఓ దొంగతనం కేసుకు సంబంధించి సొత్తు చోరిగిన మొత్తం కాకుండా కొద్దిమేర మాత్రమే రికవరీ అయిందని, అంతవరకే చోరీ జరిగినట్లు ఫిర్యాదు తీసుకోవటం కూడా పలువిమర్శలకు తావిచ్చింది. ఫిర్యాదుదారడు మెత్తుకున్నా పోలీసులు మాత్రం వినిపించుకోకుండా వారి పంథా లోనే కేసు నమోదు చేశారని బాధితుడు వాపోయాడు.

అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుండి ఇసుక రవాణా నిలిచిపోవటం అద్దంకి పోలీసులకు కాసుల పంట కురిపిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. మామూళ్లు పుచ్చుకుంటే మాత్రం రాత్రి సమయాలలో ఇసుక రవాణా కు రైట్ రైట్ చెబుతున్నారని, అలా కాకపోతే మాత్రం కేసులు నమోదు చేస్తున్నారని పలువురు ఇసుక రవాణాదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవల చోటుచేసుకున్న పలు సంఘటనలను ఉదహరిస్తున్నారు. ఇటీవల వరుసగా రెండు రోజులపాటు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో కొన్నింటిపై మాత్రమే కేసులు నమోదు చేసి మిగిలిన వాటిని వదిలివేయటం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇసుక ట్రాక్టర్ ను పట్టుకోవటంతో ఓ గ్రామ వైసీపీ నాయకుడు నియోజకవర్గ కీలకనేత చేత ఫోన్ చేయించినట్లు సమాచారం. కీలక నేత చెప్పినందున ఎలాంటి కేసు లేకుండా వదిలివేస్తారని భావించాడు. తీరా చూస్తే కీలకనేత చేత ఫోన్ చేయించిన


అద్దంకి పోలీస్ స్టేషన్

గ్రామస్థాయి నాయకుడు ట్రాక్టర్ పై కేసు నమోదు కాగా, ఎలాంటి సిఫార్సులు లేకుండా పోలీసులను కలిసి చేతులు తడిపిన ఇసుక రవాణాదారుల ట్రాక్టర్లపై ఎలాంటి కేసులు లేకుండా వదిలివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న అధికార పార్టీ కీలక నేత ఆఘమేఘాల మీద పోలీస్ అధికారిని పిలిపించి ప్రశ్నించినట్లు సమాచారం.

ఇక బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నప్పటికి పోలీస్ అధికారులు మాత్రం తమకు కేసులు అవసరమైనప్పుడు మాత్రమే దాడులు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దాడులలో పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ళు పట్టుబడ్డా కేసులో మాత్రం అత్యల్పంగా సింగిల్ డిజిట్ తోనే సరిపెడుతున్నట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో పోలీసులు దాడి చేసి పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. 46 మద్యం బాటిళ్ళు పట్టుబడ్డట్లు తొలుత ప్రకటించిన పోలీసులు కొద్దిసేపటికే మాట మార్చేశారు. కేవలం 8 బాటిళ్ల మద్యం మాత్రమే పట్టుబడినట్టు కేసు నమోదు చేశారు. దీనికి ప్రతిఫలంగా పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇలా అన్ని విధాలుగా అద్దంకి పోలీసులు తమ రూటే సపరేట్ అన్నవిధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల నూతనంగా అద్దంకి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు తీసుకున్న సీఐ అయినా మార్పు తీసుకు వస్తారా లేక పాత పద్ధతినే కొనసాగనిస్తారా అని పలువురు గుసగుసలాడుతున్నారు.

ఆడుదాం ఆంధ్రపోటీల్లో పాల్గొనేందుకు నిరాకరణ

- ప్రభుత్వం ఇచ్చిన క్రికెట్ కిట్లను పడవేసి నిరసన వ్యక్తం చేసిన క్రీడాకారులు


ఎంపీడీవో కార్యాలయం ముందు క్రికెట్ కిట్లను పడవేసి నిరసన వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

బల్లికురవ, జనవరి 25: ఆడుదాం ఆంధ్ర పోటీలలో తమను ఆడనీయకుండా వెనక్కి పంపారని బల్లికురవ గ్రామ క్రికెట్ క్రీడాకారులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు ప్రభుత్వం ఇచ్చిన క్రికెట్ కిట్లను నేలపై పడవేసి నిరసనకు దిగారు. బల్లికురవ మండల స్థాయిలో గత పది రోజుల నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలురకాల పోటీలు జరిగాయి. క్రికెట్ ఆడేందుకు మొత్తం పది జట్లు వచ్చాయి. వాటిల్లో మూడు జట్లు విజేతలుగా నిలిచాయి. వాటిల్లో మరలా పోటీలు నిర్వహించగా బల్లికురవ జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచింది. వారికి గురువారం అద్దంకిలో నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్రీడాకారులు పోటిల్లో పాల్గొనేందుకు అక్కడకు వెళ్లగా అక్కడ అధికారులు మీపేర్లు ఆన్‌లైన్‌లో లేవని, గతంలో నమోదయిన వారే పోటీలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. తాము మండలస్థాయిలో విజేతలుగా నిలిచామని, తీరా ఇప్పుడు వద్దంటారు ఏమిటని నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారికి పోటీల్లో పాల్గొనే అవకాశం ఇవ్వలేదు. దీంతో వారు బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కింద ఇచ్చిన క్రికెట్ కిట్లను నేలపై పడవేసి నిరసనకు దిగారు. కార్యాలయం ముందు పడవేసి ఉన్న సామగ్రిని చూసి అక్కడ ఉన్న పలువురు ప్రజలు ప్రభుత్వం ఇలా ప్రజాధనాన్ని వృధా చేసిందని విమర్శలు గుప్పించారు.







అద్దంకిలో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యం


అద్దంకిలోని భవానిసెంటర్‌లో బారులు తీరిఉన్న వాహనాలు

అద్దంకి, జనవరి 25: అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం అవుతుంది. పోలీసులు కూడా అప్పుడప్పుడు మాత్రమే హడావుడి చేయటం మినహా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించటం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా నామ్ రహదారిలో వాహనాల రాకపోకలు బాగా పెరగటంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతుంది. దీనికితోడు భవానిసెంటర్ లో ఐదువైపుల నుంచి వచ్చే వాహనాలు రోడ్లు దాటాల్సి ఉన్నప్పటికీ ట్రాఫిక్ ఐలాండ్ లేకపోవటంతో వాహనచోదకులు అడ్డదిడ్డంగా వెళుతున్నారు. దీంతో నామ్ రహదారిపై రెండు వైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతున్నాయి. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతున్నా పోలీస్ అధికారులు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీస్, మున్సిపల్ అధికారులు స్పందించి అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

జాబ్ మేళాలో 53 మందికి ఉద్యోగాలు

అద్దంకిటౌన్, జనవరి 25: కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 53 మంది విద్యార్థులు వివిధ సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు తెలిపారు. మొత్తం 176 మంది అభ్యర్థులు రాగా హీరో మెట్రో కార్ప్స్‌కు 11 మంది, పేటీఎంలో 17 మంది, యూఐటీ యూనివర్స్‌లో 21 మందితోపాటు పలు కంపెనీలలో మొత్తం 53 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలలో ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మోహనరావు తెలిపారు.

ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల జేకేసీ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.





ఆసరా కాదు.. టోకరా!

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య ధ్వజం



చీరాల, జనవరి 25 : సీఎం జగన్ ఆసరా పేరుతో చేసేదంతా టోకరా అని, గోరంత సాయం చేసి కొండంత ప్రచారం ఆర్భాటంతో మహిళలను వంచిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కొండయ్య ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో మహిళల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలతో పోలిస్తే జగన్ చేసింది గోరంత మాత్రమేనన్నారు. జగన్ ఒంటెద్దు పోకడతో చేపట్టిన చర్యలతో రాష్ట్రం అధోపాతాళానికి వెళ్లిందన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాల్సిన అవశ్యతను కొండయ్య వివరించారు.





రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాలటౌన్, జనవరి 25: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి సుమారు 50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటన చీరాల - జాండ్రపేట రైల్వే స్టేషన్‌ల మధ్య జరిగింది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈమేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వివరాలు తెలిసిన వారు చీరాల రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కొండయ్య తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

చీరాల, జనవరి 25: స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిర్వహించిన క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. చీరాల అర్బన్, చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఆర్డీవో సరోజిని, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంపీడీవో నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

చీరాల, జనవరి 25: నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి చేపట్టిన చర్యలతో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. మండల పరిధిలోని బోయినవారి పాలెంలో రూ.2.23 కోట్లు వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, సచివాలయ భవవాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, అంకాళరెడ్డి, బోయిన కేశవులు, బండారు శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు స్వల్పగాయాలు

పంగులూరు, జనవరి 25: తారులోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి ఫ్లైఓవర్‌పై రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈఘటన గురువారం ఉదయం జాతీయ రహదారిపై ముప్పవరం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. విజయ వాడ నుంచి నెల్లూరు వైపు తారు లోడుతో వెళుతున్న లారీ ఉదయం 8 గంటల సమయంలో అదుపుతప్పి ముప్పవరం ప్రధాన కూడలిలోగల ఫ్లైఓవర్‌పై గుంటూరువైపు వెళ్లే రోడ్డుపై తిరగబడింది. ఈఘటనతో గుంటూరు వైపు వెళ్ళే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సర్వీస్ రోడ్డువైపు మళ్ళించారు. తమిళనాడు రాష్ట్రం తిరునల్‌వెళ్ళి జిల్లా సీతారాంకొండన్ మండలం నాయుడు తీరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఇనాసిముత్తుకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.